క్లుప్తంగా

ఆక్రమణలపై అధికారుల సర్వే



పీఏసీఎస్ స్థలంలో సర్వే చేపడుతున్న అధికారులు

పొందూరు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) స్థల ఆక్రమణపై శుక్రవారం రెవెన్యూ, సర్వే అధికారులు సర్వే చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. పొందూరు పంచాయతీ పరిధి జోగన్నపేట గ్రామం వద్ద 408వ సర్వే నంబరులో 23.5 సెంట్ల విలువైన స్థలం ఉంది. స్థలానికి సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లు పీఏసీఎస్ యాజమాన్యం వద్ద ఉన్నాయి. అయితే సంబంధిత స్థలంలో కొంతభాగం పలువురు ఆక్రమించారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో స్థల పరిశీలన చేసిన అధికారులు ఆక్రమణ జరిగిందని నిర్ధారించారు. ఈ సర్వేలో సర్వేయర్ గణపతి, ప్రసాద్, శ్రావ్య, పీఏసీఎస్ సీఈవో ఎర్నేని పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారా తయారీ సామగ్రి

పాతపట్నం: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, కొత్తూరు మండలాలకు అనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన శిరడా, జంకర గూడ, రెల్లిగూడ పరిసరాల్లో 280 లీటర్ల నాటుసారా, 4,250 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే భారీగా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. దాడుల్లో శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ ఎం.శ్రీనివాసరావు, పాతపట్నం, కొత్తూరు, ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న సహిత విద్యా ఉపాధ్యాయులు

పాతపట్నం: స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నామని ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్.తిరుమలరావులు తెలిపారు. పాతపట్నంలో శుక్రవారం ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో గోవిందరావు మాట్లాడుతూ 0 నుంచి 18 సంవత్సరాల్లోపు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం మే 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు సమాచారం తెలిసినవారు 703230 8896, 85559 52868 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు సుధారాణి, ఇన్నా, సీఆర్పీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాతపట్నం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎల్.ఎన్.పేట మండలం రావిచంద్రి గ్రామానికి చెందిన చింత రామినాయుడు మృతి చెందినట్లు ఎస్ఐ బి.లావణ్య శుక్రవారం తెలిపారు. ఈనెల 14వ తేదీన మండలంలోని కమలమ్మ కొట్టు (సీది కూడలి)లో కారు, ద్విచక్ర వాహనంను ఢీకొన్న ఘటనలో ఆయన గాయపడ్డారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

బూర్జ: అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు సూచించారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి ఏపీవో ఐ.రవి, జేఈ బి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో శుక్రవారం రైతులతో కలిసి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వలన నేల తల్లికి మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంటీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సక్రమంగా చేయండి

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు పనులు సకాలంలో గ్రామాల్లో పూర్తి చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష సూచించారు. మండలంలోని నడగాంలో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం ఆమె స్వయంగా పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు తహసీల్దార్ టి.సత్యనారాయణ, సర్వేయర్ అప్పలస్వామి తదితరులు ఉన్నారు.

తీరు మారేనా..?

- పోలాకిలో రెవెన్యూ సేవలపై గందరగోళం
- తహసీల్దార్ ఆకస్మిక బదిలీ
- సక్రమంగా సేవలపై ప్రజల ఎదురుచూపులు

పోలాకి: మండలంలో రెవెన్యూ సేవల విషయంలో కొంతకాలంగా నడుస్తున్న గందరగోళానికి జిల్లా కలెక్టర్ చెక్ పెట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.సురేష్‌ను డిప్యూటేషన్‌పై కలెక్టరేట్ ఈ–సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేసి, ఆర్డీవో కార్యాలయంలో డీటీగా బాధ్యతలు చేపడుతున్న పి.శ్రీనివాసరావును ఇక్కడ తహసీల్దార్‌గా డిప్యూటేషన్‌పై నియమించారు. అయితే ఇప్పటికైనా రెవెన్యూ సేవలు సక్రమంగా అందుతాయో లేదోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా మండలంలో రెవెన్యూ సేవల్లో జరుగుతున్న పరిస్థితులపై ఇదివరకే పలుమార్లు సాక్షి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి.

కొర్రీలకు కేరాఫ్‌గా..

గతంలో ఎన్నడూ లేనివిధంగా మండలంలోని



పోలాకి తహసీల్దార్ కార్యాలయం

రెవెన్యూ సిబ్బంది ప్రతీచిన్న విషయంలోనూ కొర్రీలకు కేరాఫ్‌గా మారిపోయారంటూ ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. తహసీల్దార్‌గా సురేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ తరహా కొర్రీలు మరీ ఎక్కువైపోయాయని అనుకుంటున్నారు. అయితే సిబ్బంది కావాలనే తహసీల్దార్‌పై నెపంవేసి సేవల విషయంలో క్షేత్రస్థాయిలో అడ్డంకులు పెట్టేవారని, తద్వారా తమకు అనుకూలంగా లేని ముక్కుసూటిగా ఉన్న సురేష్‌ను ఉన్నతాధికారులు, నాయకులు, ప్రజల వద్ద విలన్‌గా చూపించారనే వాదన కూడా వినిపిస్తోంది. ఏదిఏమైనా రెవెన్యూ సేవల విషయంలో ఎన్నడూ లేని అసంతృప్తి ప్రజల నుంచి వెలువడిన నేపథ్యంలో తహసీల్దార్ బదిలీ ప్రాధాన్యత సంతరించుకుంది.

చెప్పినట్లు చేయలేదనేనా..?

తహసీల్దార్ సురేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మండలానికి చెందిన ఒక మాజీ ఎమ్మెల్యే సిఫార్సుతో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే తొలుత అధికార పార్టీ నాయకుల ఆగడాలను చూసీచూడనట్లు వదిలేసినా, అవి రానురానూ మితిమీరుతుండడంతో కట్టడిచేసే ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఈ విషయంలోనే కొందరు కూటమి నాయకులు ఎమ్మెల్యే, మంత్రి వద్ద తమగోడును వెళ్లబుచ్చడంతో తహసీల్దార్ బదిలీ వరకు వెళ్లాల్సి వచ్చిందని తెలుస్తోంది.


మళ్లీ లైను కట్టాలా..?
రెచ్చిపోతున్న మట్టి మాఫియా
పేద కుటుంబంపై కక్ష సాధింపు

రెవెన్యూ సేవలపై గతంలో సాక్షిలో ప్రచురించిన కథనాలు

గందరగోళానికి కారణమైన అంశాలు

- దీర్ఘాశి రెవెన్యూ పరిధిలో సిండికేట్ భూములకు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల నుంచి రహదారి ఏర్పాటు చేసి మట్టి తరలింపునకు సహకరించారు.
- రాజపురం రెవెన్యూ పరిధిలో కూటమి నాయకుల ఆలోచన అమలు చేసి అక్కడ ఒక పేద కుటుంబంపై కక్ష సాధింపులో భాగమయ్యారు.
- చెల్లాయివలస గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి పశువులశాలలను తొలగించి, అదే రెవెన్యూలో పక్క సర్వే నంబర్‌లలో పొజిషన్ సర్టిఫికెట్లు అందించారు.
- తీరప్రాంత గ్రామాలైన గుల్లవానిపేట, అంపలాం, రాజారాంపురం, కొవిరిపేట, కొత్తరేవు, గుప్పెడుపేట, జోగంపేట, కంబాలవానిపేట అటవీ భూముల్లో అక్రమంగా కట్టుకుంటున్న నిర్మాణాలకు సైతం పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి.
- మండల కేంద్రంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని పంచాయతీ సర్పంచ్ ఎన్నిసార్లు విన్నవించుకున్నా, ఇచ్చే అవకాశం ఉన్నా సమస్య పరిష్కరించలేదు.
- డీఎల్‌పురం రెవెన్యూ పరిధిలో పలువురు ఆక్వా రైతులకు రొయ్యలసాగుకు క్లియరెన్స్‌లు కోసం ఇబ్బందులు పెట్టారని ఆరోపణలు ఉన్నాయి.
- కోడూరులో మండల పరిషత్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల్లోనే అక్రమంగా ఎర్రమట్టిని ఎత్తుకుపోతుంటే ఎవరిపైనా చర్యలు తీసుకోలేకపోయారు.
- తీరంలో ఉప్పు ఇసుక సైతం అక్రమార్కులు తరలించుకుపోతుంటే అటవీశాఖ పేరుచెప్పి తప్పించుకున్నారు తప్ప అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.
- విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాలు లాంటి సాధారణ సేవల విషయంలో సైతం క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందికి స్వేచ్ఛ ఇవ్వలేదన్నది ప్రధానంగా వినిపిస్తున్న ఆరోపణ.

బోరు వాడేదెలా..?



సారవకోట మండలంలోని బుడితి గ్రామ సచివాలయానికి పక్కనే ఉన్న తాగునీటి బోరు వాడేదెలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ బోరు దగ్గర వినియోగించే నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో బోరు చుట్టూ మురుగు నీరుగా తయారైంది. దీంతో స్థానికులు ఆ బోరు నీటిని వినియోగించేందుకు అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. సచివాలయంకు పక్కనే ఉన్నా సిబ్బంది దీనిపై స్పందించకపోవడం విచారకరం.

– సారవకోట

ఉర్లాం ప్రజలకు అవస్థలు



నరసన్నపేట మండలంలోని ఉర్లాంలో జలజీవన్ మిషన్ పనులు ప్రజలను అవస్థలకు గురి చేస్తున్నాయి. ఒకవైపు తాగునీటికి ఇబ్బందులు పెరగగా, మరోవైపు రోడ్లు ఎక్కడికక్కడ తవ్వి పైపులు వేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో నెల రోజులుగా జలజీవన్ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామానికి నీటి సరఫరా చేస్తున్న పైపులైన్లు ఈ పనులతో బాగా శిథిలం అయ్యాయి. దీంతో వస్తున్న నీరు ఆగిపోయింది. ప్రస్తుతం నీటి కొరత అధికంగా ఉంది. ఈ పనులు కూడా సకాలంలో జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంటింటికీ తాగునీరు వెంటనే అందించాలని సర్పంచ్ పోలాకి నర్శింహమూర్తి కోరుతున్నారు.

– నరసన్నపేట

శిథిలమయం



సరుబుజ్జిలి మండలంలోని తమ్మినాయుడుపేట చిరతగట్టు జంక్షన్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ షెల్టర్‌లో డకరవలస, సుభద్రాపురం, తమ్మినాయుడుపేట గ్రామాల ప్రజలు బస్సుల రాకకోసం ప్రతీరోజూ వేచి ఉంటారు. షెల్టర్ పిల్లర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. దీనివలన ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే షెల్టర్‌ను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

అధికారం అండతోనే అపార్ట్‌మెంట్ నిర్మాణం



మాట్లాడుతున్న చింతు రామారావు, గుప్త

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లో బిల్డింగ్ సొసైటీ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం అధికార పార్టీ నాయకుల అండతోనే జరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు చింతు రామారావు, సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. నిబంధనలను అతిక్రమిస్తున్నా అధికారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలం గొండు రామన్నకు లేదని, జరిగిన రిజిస్ట్రేషన్ కూడా చెల్లదని అన్నారు. అలాగే రామన్న ఆర్‌కే బిల్డర్స్‌కు చేసిన అగ్రిమెంట్ కూడా చెల్లదని స్పష్టం చేశారు. కేవలం అధికారం అండతోనే నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో నరసన్నపేటకు చెందిన రిజిస్ట్రేషన్ అధికారులు, పంచాయతీ అధికారులు, సుడా అధికారులు దోషులుగా నిలబడతారని అన్నారు. టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని, పట్టణంలో 70 శాతం ఆక్రమణ టీడీపీ నాయకులు చేసినవేనని అన్నారు. సమావేశంలో ఎంపీపీ రంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, పార్టీ నాయకులు బగ్గు రమణయ్య, కనలప శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల కల్పనపై సమీక్ష

పొందూరు: సాగునీటి వనరుల కల్పనకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల సౌజన్యంతో పనులను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎంపీడీవో మన్మథరావులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

రైతులకు అవగాహన కల్పించి, వారి భూముల్లో ఫారంపాండ్లు, చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు



వివరాలు నమోదు చేస్తున్న ఏవో సంధ్య తదితరులు

హిరమండలం: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హులైన రైతులను గుర్తించడం జరుగుతోందని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. మండలంలోని గార్లపాడు ఆర్‌అండ్ఆర్ కాలనీలో అర్హులైన రైతుల వివరాలను శుక్రవారం నమోదు చేశారు. మండలంలో సుమారు 10,900 మంది రైతులు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 4 వేల మంది రైతుల వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట/నరసన్నపేట/బూర్జ: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచించారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలన్నారు.

జయహో..!



పాతపట్నం: కోర్టు కూడలిలో జాతీయ జెండాలతో మానవహారం

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో జిల్లాలోని పలుచోట్ల భారత సైనిక దళాలకు సంఘీభావంగా శుక్రవారం ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అణిచివేయాల్సిన అవసరం ఉందన్నారు. జయహో నినాదాలతో హోరెత్తించారు. – సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



రెడ్డి శాంతిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

పాతపట్నం: గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల పార్టీ మండల వైస్ సర్పంచ్‌లు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా నియమితులైనవారు శుక్రవారం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ విభాగం కన్వీనర్ ఎనుగుతల సూర్యం, వైస్ సర్పంచ్‌లు గోకవలస రాము, పనుకు మోహన్, కార్యదర్శులు టంకాల సుధాకర్, చింతాడ త్రినాథ్, మజ్జి వరదరాజులు, మజ్జి తిరుపతిరావు, బమ్మిడి శేఖర్, పద్మ నేతాజీ, వంశీ, పెద్దింటి తిరుపతి, వరదరాజులు, భోగిరాజు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

ఆమదాలవలస రూరల్: వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో వ్యవసాయ శాఖ ద్వారా రాయితీతో యాంత్రికరణ పనిముట్లను రైతులకు శుక్రవారం అందించారు.

ప్రభుత్వం రాయితీపై అందించే యంత్రాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, జేడీ త్రినాథస్వామి, ఏవో మెట్ట మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు




బూర్జ: మాధవరావును పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని


బూర్జ: మండలంలోని తుడ్డలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కెంబూరి మాధవరావు, సింగన్నపాలేం గ్రామంలో గేదెల మొఖలింగాన్ని వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, నాయకులు వావిలపల్లి మురళి, ఇసాయి వెంకటరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని అక్కివలస గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్ యాళ్ల హేమంత్ తండ్రి యాళ్ల రమణ ఇటీవల అనారోగ్యం పాలైయ్యారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి అజంతాకుమారి, దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు అత్తులూరి రవికాంత్, ముత్తా అనిల్, కె.చిన్నారావు తదితరులు ఉన్నారు.

పాతపట్నం: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. పాతపట్నం మేజర్ పంచాయతీ అచ్చుతాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మజ్జి భుజంగరావు ఇటీవల ఆపరేషన్ చేసుకున్నారు. దీంతో అయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే స్థానిక కాపు వీధికి చెందిన ఎన్ని రామారావు భార్య నాగమ్మకు ఇటీవల గాయాలయ్యాయి. అదేవిధంగా బచ్చల తిరుపతిరావు భార్య చిన్నమ్మడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో వీరిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, పార్టీ ఐటీ విభాగం కన్వీనర్ ఎనుగుతల సూర్యం, వైస్ సర్పంచ్ గోకవలస రాము, నాయకులు చింతాడ త్రినాథరావు, మజ్జి వరదరాజు, శేఖర్, నేతాజీ, వంశీ, మజ్జి తిరుపతిరావు, పెద్దింటి తిరుపతిరావు తదితరులు ఉన్నారు.



ఆమదాలవలస: రమణను పరామర్శిస్తున్న రవికుమార్



పాతపట్నం: భుజంగరావును పరామర్శిస్తున్న రెడ్డి శాంతి తదితరులు

సాగుకు సన్నద్ధం



కృష్ణాపురం వద్ద పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న అన్నదాతలు
- జూన్‌లో విత్తనాలు వేసుకునేందుకు చర్యలు

ఎల్.ఎన్.పేట: మరి కొన్నిరోజుల్లో ఖరీఫ్ వరిసాగు సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు కోసం విత్తనాలు వేసుకునేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో కురుస్తున్న వర్షాలకు పొలాలను దుక్కిలు చేయడం, పొలాల్లో చెరువు మట్టి, కుళ్లిన గత్తం వేయడం వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరోవైపు ఏ విత్తనాలు వేసుకోవాలి, విత్తనాలు ఎక్కడ లభిస్తాయి, అవసరమైన విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తుందో లేదోనని ఆలోచిస్తున్నారు. విత్తనాలు ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటే ఎంత



జంబాడ వద్ద సిద్ధంగా ఉన్న పొలాలు

ఖర్చవుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించే దిశగా సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు.

విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి. విత్తనాలు రైతు సేవా కేంద్రాల ద్వారా ఊరులోనే అందించాలి. పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఇవ్వాలి.

– అశోక్ కుమార్ పాణిగ్రాహి, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

ఇబ్బంది లేకుండా చర్యలు



మరి కొన్నిరోజుల్లో ఖరీఫ్ వరిసాగు ప్రారంభమవుతుంది. ఖరీఫ్ వరిసాగులో రైతులకు విత్తనాలు, ఎరువులు కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట సాగుకు అవసరమైన విత్తనాలు సరఫరా చేస్తున్నాం. గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రైతులతో సమావేశమై అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

స్థలం కేటాయించండి



ఎమ్మెల్యే కూనకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మున్సిపాలిటీలో పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. స్థలం కోసం పలుమార్లు అధికారులు, నాయకులను కలిసి విన్నవించినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అయితే పెన్షనర్ల సంఘ భవన నిర్మాణం కోసం స్థలం మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించినవారిలో సంఘం కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, విశ్రాంత తహసీల్దార్ జల్లేపల్లి రామారావు, సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, ఆర్.సత్యనారాయణ, బీవీ రమణ, బి.సూర్యనారాయణ, కె.షణ్ముఖరావు, పి.భానుజీరావు, డి.శ్రీరామమూర్తి, ఎన్.వాసుదేవరావు, జె.నరసింహరాజు, పి.ధనుంజయరావు, బలివాడ వెంకటరమణ, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.